క్లుప్తంగా

వృద్ధులు, చిన్నారులకు పండ్లు పంపిణీ

మామిడికుదురు: మొగలికుదురు సత్యసాయి భరోసా దీన జనోద్ధరణ కేంద్రంలోని వృద్ధులు, చిన్నారులకు ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు, స్వీట్లు, తినుబండారాలను అందించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని సందర్శించిన మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ పాలకులు అనాథ పిల్లలపై నిర్లక్ష్యం చూపుతున్నాయన్నారు. వారి విద్య, సంరక్షణ, ఉపాధి బాధ్యతలు ప్రభుత్వంపై ఉందన్నారు. వారిపై ప్రభుత్వ తీరులో కూడా మార్పు రావాలన్నారు. వారి సంరక్షణ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్రం వార్డెన్ కృష్ణ, ఎంఎస్పీ నాయకులు ఆకుమర్తి భాస్కరరావు, మండల శాఖ మాజీ అధ్యక్షుడు మంద గాంధీ, చుట్టుగుళ్ల వెంకటేశ్వరరావు, మల్లవరపు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చింతనలంకలో త్రిదండి రామచంద్రరామానుజస్వామి

అయినవిల్లి: చింతనలంకలో వారం రోజులుగా సప్తాహాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామానుజస్వామి ఆదివారం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైతే ప్రతి ఫలాపేక్ష లేకుండా పనిచేస్తున్నారో వారికి దైవానుగ్రహం సిద్ధిస్తుందన్నారు.

నేడు ఆఖరు మజిలీ శాశ్వత కట్టడం ప్రారంభం

అంబాజీపేట: మాచవరం హిందూ శ్మశానవాటికలో శ్రీరామ్‌ఘాట్–దుర్గా క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన ఆఖరు మజిలీకి శాశ్వత కట్టడాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కట్టడాన్ని మంచాల పెదకాపు, సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థంగా వారి కుమారులు సత్యనారాయణ, శ్రీనివాస్‌లు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

పంట కాలువలను శుభ్రం చేశారు


ఇసుకపూడిలో శుభ్రం చేసిన పంట కాలువ

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: చిరతపూడి నుంచి మాచవరం వచ్చే పంట కాలువలను సంబంధిత శాఖ అధికారులు శుభ్రం చేయించారు. ఈ నెల 31న 'సాక్షి'దినపత్రికలో పంట కాలువలో పశువుల మృతదేహాలు అనే వార్తా కథనం వెలువడింది. దాంతో పంట కాలువలో ఉన్న పశువుల మృతదేహాలు, కోళ్ల వ్యర్థాలను తొలగించి, పంట కాలువను శుభ్రం చేయించారు. పంట కాలువలో ఎవరైనా చెత్త వేసినట్లు గుర్తిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

డివిజన్‌లో ఎరువుల కొరత లేదు

ఆలమూరు: డివిజన్ పరిధిలోని ఆలమూరు మండలంలో ఎరువులు కొరత లేనందున రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చింతలూరు సొసైటీ పరిధిలో ఎరువుల ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గత నెలలో మండలానికి 4790 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా నెలాఖరు నాటికి 5300 మెట్రిక్ టన్నుల సరఫరా జరిగిందన్నారు. అలాగే 2943 మెట్రిక్ టన్నులు డీఏపీ, 1242 ఎంటీ సూపర్, 6180 ఎంటీ కాంప్లెక్స్ ఎరువులు మండల వ్యాప్తంగా నిల్వలు ఉన్నాయన్నారు. ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య, ఏఈఓ కిషోర్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆదర్శం

అంబాజీపేట: ఏసుక్రీస్తు ప్రేమకు ప్రతిరూపమని, క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రు శివారు కోటవారిపేటలో కల్వరి చర్చిలో రెవ.కేఆర్ ప్రకాష్, మేరీల ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసు క్రీస్తు చూపిన శాంతి, ప్రేమ మార్గాలను అంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, నాగవరపు నాగరాజు, కుసుమ శ్రీను, నాగాబత్తు లక్ష్మీనివాస్, కోట మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రపంచ శాంతికి అందరూ ప్రార్థించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మొండెపులంకలో హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ వై.డేవిడ్ ప్రకాష్, చర్చి ప్రెసిడెంట్ సర్నెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కేకు కట్ చేశారు. అందరికీ మేలు జరగాలని చిట్టిబాబు ప్రార్థించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, నాయకులు నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, మానుకొండ జయానందరావు, యల్లమిల్లి రత్నంరాజు, చిల్లే మోహనరావు, పల్లి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా న్యూ ఇయర్ వేడుకలు

- కేకులు కట్ చేసిన ఎమ్మెల్యేలు కొండేటి, రాపాక


నగరంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు


చింతలమోరిలో ఎమ్మెల్యే వరప్రసాదరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు

మామిడికుదురు: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. పలు గ్రామాల్లోని కూడళ్లలో యువకులు కేరింతలు కొడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. నగరంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తన స్వగృహం వద్ద పార్టీ శ్రేణుల కోలాహలం నడుమ న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. చిట్టిబాబు ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఆనందంగా జీవించాలని అభిలషించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి, తహసీల్దార్లు ఠాగూర్, సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీఓలు కె.వెంకటేశ్వరరావు, ఐ.రత్నంరాజు, ఈదరాడలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, లూటుకుర్రులో జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబును పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మగటపల్లిలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలు కార్యాలయాల్లో పలువురు అధికారులకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వివిధ రకాల పూల బొకేలతో తమ అభిమాన నాయకులను, ఉన్నత ఉద్యోగులను చిరుద్యోగులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మలికిపురం మండలంలోని చింతలమోరిలో ఎమ్మెల్యే రాపాక ఇంటి వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే రాపాకకు వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ఎమ్మెల్యే పంచారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారికి శుభాలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీలు కుసుమ వనజకుమారి, వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రుద్రరాజు చిన్నరాజా, రాపాక దీవెనకుమారి, నాయకులు కునాథరాజు చంటిరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీ, కేఎస్ఎన్ రాజు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని యావత్ ప్రజానీకం ఆనందోత్సాహాల మధ్య 2023 నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ప్రజలందరూ నిరాడంబరంగా జరుపుకొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చెముడులంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఆలమూరులో రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావులకు పార్టీ శ్రేణులు, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోను, పంచాయతీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వేడుకలు చేశారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజుకు సమాఖ్య ప్రతినిధులు బొకేలు ఇచ్చి సత్కరించారు. అలాగే సఖినేటిపల్లిలో ఎంపీపీ వీరా మల్లిబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎంపీడీవో జి.భీమారావు ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.


సఖినేటిపల్లిలో ఎంపీపీ మల్లిబాబును సత్కరిస్తున్న ఎంపీడీవో భీమారావు

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. కేకులు కట్ చేసి, ఒకరి కొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అలాగే క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. బెల్లంపూడి మత్తయి లూథరన్ చర్చిలో పాస్టర్ దొరబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర ప్రార్థనలు జరిగాయి. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలోని వివిధ పార్టీల నాయకుల ఇంట నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కొత్తపేటలో రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు తదితర నాయకులు, సర్పంచ్‌లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వాడపాలెంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాసరావు, కొత్తపేటలో రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం తదితర నాయకులకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదివారం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుకు, గంగలకుర్రులో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మికి, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజులను వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారు, ఏఓ, విద్యుత్ శాఖ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, ఉద్యాన పరిశోధన కేంద్రాలు కిటకిటలాడాయి.

అట్టహాసంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు

- సందడిగా మారిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వగృహం
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రావులపాలెం: నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో వెల్లివిరియాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నూతన సంవత్సర వేడుకలను మండలంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. గోపాలపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులతో సందడిగా మారింది. నియోజకవర్గంలోని రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, జగ్గిరెడ్డి అభిమానులు పుష్పగుచ్ఛాలు, పూలదండలతో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆ ప్రాంతం అంతా కోలాహలంగా తిరునాళ్లను తలపించింది. తొలుత ఉదయాన్నే వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఇతర పాలక మండలి సభ్యులు, వేదపండితులు, మందపల్లి మందేశ్వరస్వామి ఆలయాల పండితులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దంపతులకు, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వాదం అందజేశారు. అలాగే వివిధ మతాలకు చెందినవారు సర్వమత ప్రార్థనలు చేసి కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని కాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు తీసుకువచ్చి భారీ కేకులను కట్ చేసి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల కన్వీనర్లు దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఇతర కుటుంబసభ్యులకు వేదాశీర్వాదం అందిస్తున్న వాడపల్లి దేవస్థానం పండితులు, శుభాకాంక్షలు తెలుపుతున్న పాలక మండలి సభ్యులు

ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

ఆత్రేయపురం: హిందూ పురాణ ప్రసిద్ధ సంప్రదాయ పర్వదినాల్లో ప్రధానమైన 'వైకుంఠ ముక్కోటి ఏకాదశి' సోమవారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ప్రసిద్ధ ఆలయాలను ముస్తాబు చేశారు. ధనుర్మాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశిని వైకుంఠ ముక్కోటి ఏకాదశిగా జరుపుకొంటారు. దీంతో సోమవారం ఉదయం నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం వేణుగోపాలస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, కనకమహాలక్ష్మి, మల్లమ్మ ఆలయాలతో పాటు బొబ్బర్లంకలో వేంచేసిన అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు, ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

కొత్తపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ, భూ సహిత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆ ప్రాంగణంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దన స్వామికి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య మహిళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వాకచర్ల భద్రమ్మ నేతృత్వంలో రాజమహేంద్రవరం రామాంజనేయ భజనమండలి వారితో గానామృతంతో కూడిన వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల రామచంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కొత్తపేటలో ముక్కోటి రామాలయం

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించే ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజ మహోత్సవాన్ని ఈ నెల 5న నిర్వహించనున్నామన్నారు. అంతకు ముందు ధనుర్మాసం సందర్భంగా స్వామిని పల్లకీలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.


అంబాజీపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి

ఘనంగా లక్ష తులసి అర్చన

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసి అర్చన వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితులు ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. హరే శ్రీనివాస భజన బృందం, మహిళ భక్తులు సామూహికంగా విష్ణుసహస్ర నామ పారాయణను పఠించారు. లక్ష తులసి అర్చన సందర్భంగా స్వామిని ఆది వరహాస్వామి రూపంలో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి లక్షతులసి అర్చనను భక్తి శ్రద్ధలతో తిలకించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

రాజోలు: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాజోలుకు చెందిన క్రీడాకారులు జి.దినేష్ ఆదిత్య, కేటీడీ వెంకటేష్, ఎం.తేజస్వి, కేబీఎస్ఎల్ శైలజ, సీహెచ్ ధరణి ఎంపికయ్యారు. ఈ మేరకు సర్పంచ్ రేవు జ్యోతి క్రీడాకారులను అభినందించారు. గత ఏడాది డిసెంబర్ 28న రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–19 విభాగంలో జి.దినేష్ ఆదిత్య, కేడీటీ వెంకటేష్‌లు బంగారు పతకాలు, ఎం.తేజస్వి వెండి పతకం సాధించారు. అలాగే నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శైలజ వెండి పతకం, సీహెచ్ ధరణి కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించే విధంగా కృషి చేసిన కోచ్ కె.చిన్న, జూనియర్ కోచ్ ఆర్.మణికుమార్‌లను పలువురు అభినందించారు. తైక్వాండో పోటీలకు శిక్షణ ఇచ్చేందుకు రాజోలు పట్టణ శెట్టిబలిజ సంఘ భవనం సముదాయాన్ని కేటాయించడంపై సంఘ సభ్యులకు కోచ్ చిన్నా కృతజ్ఞతలు తెలిపారు.


తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

పంట కాలువలోకి దూసుకెళ్లిన జీపు

రావులపాలెం: స్థానిక అమలాపురం రోడ్డులో ఆదివారం ఒక జీపు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరానికి చెందిన వెలుగుబంటి చరణ్ జీపులో కొత్తపేట వైపు వెళుతున్నాడు. పెంకులపాటి గరువు సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో చరణ్ సురక్షితంగా బయటపడ్డాడు. అయితే నీటిలో మునిగిపోయిన జీపును రావులపాలెం పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీయించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్సై ఎం.వెంకటరమణ పరిశీలించారు.


కాలువలోకి దూసుకుపోయిన జీపు

పింఛనోత్సాహం

- 2,500 నుంచి రూ.2,750కి పెరిగిన పింఛన్
- లబ్ధిదారుల్లో ఆనందం


తొత్తరమూడిలో గిడ్ల రామలక్ష్మికి పెంచిన ఫించన్ అందిస్తున్న వలంటీర్ సహదేవ్


మామిడికుదురు మండలం నగరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు


సంధిపూడిలో వేకువజామునే పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీర్లు, పార్టీ నేతలు


అంబాజీపేటలో డయాలసిస్ పేషెంట్ గోపాలకృష్ణకు పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్ సతీష్

కొత్తపేట: నాడు ప్రతిపక్షనేతగా తన సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగడుగునా కనిపించిన అవ్వ, తాతలతో మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించారు. దానికి తగ్గట్టుగానే 'వైఎస్సార్ పింఛను కానుక'ను నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచుతా.. అని చెప్పారు. చెప్పినట్టుగానే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు రూ.2 వేలకు పెంచిన పింఛను మూడేళ్లలో ఏటా రూ.250 చొప్పున పెంచుతూ ఈ నెల నుంచి 2,750కి పెంచి పంపిణీ చేశారు. దాంతో ఆయా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొత్తపేట నియోజకవర్గంలో 35,029 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో 31,412 మంది, రాజోలు నియోజకవర్గంలో 25,289 మంది పింఛన్లు పొందుతున్నారు. వారందరూ గత నెల వరకూ రూ 2,500 తీసుకోగా ఈ నెల నుంచి ఆదనంగా రూ 250తో కలిపి రూ.2,750 పొందుతున్నారు.

దయాలసిస్ పేషెంట్‌కు పింఛన్ పంపిణీ

అంబాజీపేట: అంబాజీపేటలో డయాలసిస్‌తో బాధపడుతున్న గుబ్బల గోపాలకృష్ణకు రూ.10 వేల పింఛన్‌ను సచివాలయ కన్వీనర్ కుడుపూడి సతీష్ ఆదివారం అందజేశారు. సతీష్ వెంట వలంటీర్ రాయుడు మోహన్ ఉన్నారు.

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో పెంచిన ఫించన్‌ను గిడ్ల రామలక్ష్మికి వలంటీర్ ముత్తాబత్తుల సహదేవ్ అందించాడు.

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్ముతో సామాజిక పింఛన్‌దారులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, చొప్పెల్లలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సంధిపూడిలో సొసైటీ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్నతో పాటు ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా ప్రతినిధులు ఈ పింఛన్లను అందజేశారు. తొలి రోజున వేకువజామునే ప్రారంభించిన పింఛన్ల పంపిణీ ప్రక్రియ సుమారు 85 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు.

సఖినేటిపల్లి: నూతన సంవత్సరంలో ఒకటో తేదీ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇచ్చిన పింఛన్ మొత్తం అందుకున్న పింఛన్‌దారుల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది. ఇంత వరకూ ఇస్తున్న పెన్షన్ రూ.2500కు మరో రూ.250 కలిపి మొత్తం రూ.2750 పింఛనర్లకు గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. మోరిలో దివ్యాంగుడు గాడా దొరబాబుకు వలంటీర్ అడ్డాల మౌనిక పెంచిన పింఛన్ ఇంటి వద్ద అందజేశారు.

మామిడికుదురు: ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ బాట వీడలేదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆయన ఆదివారం నగరంలో పెంచిన పింఛన్ సహాయం పంపిణీ చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ కరోనా వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు అనుగుణంగా పింఛన్ సహాయాన్ని ఈ నెల నుంచి రూ.2,750కు పెంచారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలపై జగన్‌కు ఉన్న చిత్తశుద్ధిని ప్రజలు గమనించి ఆయనకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్‌హుస్సేన్, పార్టీ నేతలు కొండేటి వెంకటేశ్వరరావు, వికాస్‌బాబు, స్టాలిన్, బత్తుల లక్ష్మణరావు, వలంటీర్లు పాల్గొన్నారు.


మోరిలో దివ్యాంగుడైన గాడా దొరబాబుకు పింఛన్ ఇస్తున్న వలంటీరు మౌనిక

చాలా ఆనందంగా ఉంది

నాడు రాజశేఖరరెడ్డి పుణ్యమా అని నాకు పింఛన్ మంజూరైంది. నేడు సీఎం జగన్ పుణ్యమా అని ఏటా పింఛన్ డబ్బులు పెంచుతూ ఈ నెల రూ.2,750 ఇచ్చాడు. ఆయనకు మా బోటి పేదోళ్లం ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– పచ్చమట్ల ధనలక్ష్మి, ఓఏపీ లబ్ధిదారు, కొత్తపేట



పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

పి.గన్నవరం: పోతవరంలోని ఒక గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తోన్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి పి.గన్నవరం ఎస్సై పి.గంగా భవాని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై గంగాభవాని తెలిపారు. వారి నుంచి రూ.26,280 స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె వివరించారు.

రావులపాలెంలో మరో ఐదుగురు..

రావులపాలెం: మండలంలోని ఊబలంక లంక పొలాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నిబంధనల ఉల్లంఘనపై కేసులు

రావులపాలెం: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ ఆదివారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మూడు, ట్రిపుల్ రైడింగ్ ఆరు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

పది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

అయినవిల్లి: మండలంలో న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన పది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. న్యూఇయర్ వేడుకల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మందిని అదుపులోకి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.